

అర్జీలకు క్యూకట్టిన జనం

పూతలపట్టులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రెవెన్యూ సదస్సుకు అర్జీదారులు క్యూకట్టారు

- 8లో



ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో

చౌడేపల్లె- సోమల మార్గంలో బస్సును టెంపో ఢీకొన్న ప్రమాదంలో 22మంది గాయపడ్డారు.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	26
తిరుపతి	34	26
తిరుమల	30	22
గూడూరు	37	28
నగరి	36	27

న్యూస్‌రీల్

విజయా డెయిరీ పరిశీలన

– సీఎం పర్యటన నేపథ్యం..



డెయిరీని పరిశీలిస్తున్న అమూల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు విజయా డెయిరీని బుధవారం అమూల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు సందర్శించారు. డెయిరీని పునః ప్రారంభానికి త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ఈక్రమంలో డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, కో ఆపరేటివ్ సొసైటీ కమిషనర్ అహ్మద్‌బాబుతో పాటు అమూల్ సంస్థ ఆపరేషన్ హెడ్ అమర్‌జిత్ సింగ్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి విక్రమ్‌చౌడ, కలెక్టర్ సగిలి షణ్మోహన్ డెయిరీని సందర్శించారు. డెయిరీ ఆవరణలో కలియతిరిగి వివిధ విభాగాలను, భవనాలను, యంత్రాలను భవిష్యత్తులో ఏమాత్రం ఉపయోగపడతాయన్నది నిశితంగా పరిశీలించారు. వీరివెంట జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీసీఏఓ వనజ, డీసీఓ బ్రహ్మానందరెడ్డి, జిల్లా డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్, డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, చిత్తూరు ఆర్డీఓ రేణుక, చిత్తూరు తహసీల్దారు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ అభివృద్ధిపై సమావేశం



కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ అభివృద్ధిపై విజయవాడలో బుధవారం దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణతో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సమావేశం అయ్యారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఆలయ అభివృద్ధి పనులపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేసి, అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



కానుకల లెక్కింపులో సిబ్బంది

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. స్వామివారికి కానుకల రూపంలో రూ.1.19 కోట్లు, 0.050 గ్రాముల బంగారం, 438 కేజీల వెండి, 72 నోట్ల విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. 20రోజుల్లోనే ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

కేజీబీవీ పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనను పర్యవేక్షిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : కేజీబీవీ పోస్టులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను పకడ్బందీగా పరిశీలిస్తున్నట్లు డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ కాలనీ మున్సిపల్ పాఠశాలలో సర్టిఫికెట్‌ల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ సీనియర్ హెచ్‌ఎంలను బృందాలుగా విభజించి సర్టిఫికెట్‌లను పరిశీలించినట్లు పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్స్, పీజీటీ, సీఆర్‌పీ, పీఈటీ మొత్తం 90 పోస్టుల భర్తీకి కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ మండలాల నుంచి 130 మంది పాల్గొన్నట్లు చెప్పారు. మిగిలిన 115 మంది గురువారం సర్టిఫికెట్‌ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉందని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత డెమో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో అర్హత సాధించిన వారిని పోస్టులకు ఎంపిక చేస్తామని తెలిపారు. జీసీడీవో సుజాత, సీఎంవో గుణశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటముని, చిత్తూరు ఎంఈవో–2 మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

జీవన యోగం.. ఆరోగ్య భాగ్యం

- ఆసనాల సాధనతో సంపూర్ణ ఆరోగ్యం –జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- భాగస్వామ్యమైన అధికారులు, న్యాయమూర్తులు

సాక్షి, చిత్తూరు: ప్రతి రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని యోగా కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్‌కుమార్‌తో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. న్యాయమూర్తి భీమారావు మాట్లాడుతూ రోజు గంట సేపు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రశాంత జీవితం గడపాలంటే యోగా చాలా అవసరమని తెలిపారు. యోగాతో శరీరానికి సమతుల్యత లభిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన శరీరాకృతి, జీవప్రక్రియను మెరుగుపడడం, అలసట తగ్గడం వంటి సాధారణ సమస్యలు తొలగిపోతాయన్నారు. హృదయ స్పందన రేటును నియంత్రించడం, అధిక రక్తపోటు, గుండెపోటు, మధుమేహం, ఒత్తిడి స్థాయిని తగ్గించడం వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు యోగా పరిష్కారం చూపుతుందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఇందుకు యోగా అవసరమని తెలిపారు. ప్రస్తుత ఆహార అలవాట్లు, అనారోగ్య సమస్యలు, ఒత్తిడి నుంచి విముక్తికి యోగా ఒక్కటే మార్గమన్నారు. అనంతరం యోగా కేంద్రంలో అతిథులతోపాటు జడ్జి శ్రీనివాసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో యోగా గురువు అనురాధ యోగాసనాలు వేయించారు.



యోగాసనాలు వేస్తున్న జేసీ శ్రీనివాసులు, తదితరులు

వాహనాలకు హై సెక్యూరిటీ

వాహనాలకు పూర్తి రక్షణ కల్పించే దిశగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ ఆదేశాలను అమలు చేసేందుకు రవాణాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. చాలా వాహనాలకు నంబర్ ప్లేట్లు వివిధ రూపాల్లో దర్శనమిస్తుంటాయి. విడతల వారీగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు ప్రారంభించారు.

- కొత్త నంబరు ప్లేట్ తప్పనిసరి
- అమలుకు రంగులోకి దిగిన రవాణాశాఖ
- విడతల వారీగా ప్రక్రియ పూర్తికి చర్యలు



హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్లు

చిత్తూరు రూరల్ జిల్లాలో హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) అమర్చుకోవాలని 2013 సంవత్సరంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానాన్ని అమలు చేయాలని రవాణాశాఖ కార్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు చేసింది. అయితే హెచ్‌ఎస్‌ఆర్‌పీల అమలు ఇప్పటి వరకు మందకొడిగా సాగిందనే చెప్పాలి. ఈ క్రమంలో వీటి ప్రాధాన్యత గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కొనుగోలు చేసిన ప్రతి నూతన వాహనంతో పాటు, పాత వాహనాలకు కూడా అమర్చాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు అతిక్రమించి ఇష్టారాజ్యంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకుని రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ కొరడా ఝుళిపించనుంది.ఇందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది.

పలు ప్రయోజనాలు

- ప్రత్యేక ప్రోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన నంబర్ ప్లేటులోనే చాసిస్ నంబర్ పాటు అనేక అంశాలు పొందుపరిచి ఉంటాయి.
- వాహనం చోరీ అయిన సమయంలో సైతం ఆ సెక్యూరిటీ ప్లేటును విరగ్గొట్టడం అంత తేలిక కాదు.
- నంబర్ ప్లేట్‌లను తొలిగించినా..గుర్తు తెలియని దుండగలు చోరీ చేసినా పసిగట్టవచ్చు.
- అధికారుల తనిఖీ సమయంలో చాసిస్ నెంబర్ లేకపోవడం, నంబర్ ప్లేటు మార్పును తేలిగ్గా గుర్తించవచ్చు.
- హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేటు కోసం 'ఏపీ ఆర్టీఏ సిటిజన్. ఈ ప్రగతి.ఓఆర్జీ సైట్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.
- తద్వారా రోజుల వ్యవధిలోనే నంబర్ ప్లేటు అందుతుంది.
- ఆన్‌లైన్‌లో చేసుకోలేని వారు ఆర్టీఓ కార్యాలయం, వాహన షోరూంల్లో సంప్రదించవచ్చు.

జిల్లాలో వాహనాల సంఖ్య ఇలా...

వాహనాలు	సంఖ్య
ద్విచక్రవాహనాలు	2,40,000
కార్లు	23,000
గూడ్స్ వెహికల్స్	17,000
బస్సులు	2,000
ఆటోలు	4,250
అంబులెన్స్‌లు	235
ఇతర వాహనాలు	80,000

మార్గదర్శకాలు పాటించాలి

ప్రతి ఒక్కరూ కచ్చితంగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి. వాహనాలకు తప్పని సరిగా హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబర్లు పేట్లు అమర్చుకోవాలి. తద్వారా ఎంతో మేలు జరుగుతుందనే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. స్పెషల్ డ్రైవ్ ప్రారంభించడంతో పాటు, ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.



–నిరంజన్ రెడ్డి, డీటీసీ, చిత్తూరు

బడుగుల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా

బంగారుపాళెం: బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ.. వారి అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనుకబడిన కులాల సంక్షేమానికి పెద్ద పీటవేశారన్నారు. 56 బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించారన్నారు. చిత్తూరు జిల్లాకు నాలుగు బీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవులను కేటాయించారని తెలిపారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుం దన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని తెలిపారు. అలాగే పూతలపట్టు నియోజకవర్గంలో గతంలో కంటే ఎక్కువ మెజారిటీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కలసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని తెలిపారు. మాజీ ఎంపీపీ సుగుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు విద్యాసాగర్‌రెడ్డి, కురబ, ఈడిగ, వడ్డెర కార్పొరేషన్ల డైరెక్టర్లు అమరనాథ్, ఎల్లప్ప, మొగిలీశ్వర్, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారే సోమశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కృపాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెండుగా ఉపాధి అవకాశాలు

- ఇంటర్మీడియట్ అర్హతతో ఐటీ ఉద్యోగాల కల్పన
- కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి
- కలెక్టరేట్‌లో హెచ్‌సీఎల్, అన్ని యాజమాన్యాల, కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెండుగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమందిరంలో హెచ్‌సీఎల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, జిల్లాలోని అన్ని యాజమాన్యాల కళాశాలల నిర్వాహకులతో, ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్‌తో సమన్వయం చేసుకుని జిల్లాలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అతి తక్కువ ఖర్చుతో హెచ్‌సీఎల్ కంపెనీలో శిక్షణ పొంది ఐటీ ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఇందుకు రాత పరీక్షలో అర్హత పొందాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఏడాది శిక్షణ అనంతరం ఉద్యోగంలో చేరవచ్చని తెలిపారు. ఉద్యోగం చేసుకుంటూనే హెచ్‌సీఎల్ కంపెనీ టైఅప్ అయిన బిట్స్ పిలానీ, శస్త్ర యూనివర్సిటీ, ఐఐఎం నాగపూర్, కెఎల్ యూనివర్సిటీ, అమిటి యూనివర్సిటీలలో ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. జిల్లాలో మొదటి విడతగా 200 మంది విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ ప్రతి 6 నెలలకు ఒకసారి పునరావృతం అవుతుందని కలెక్టర్ చెప్పారు.



పాల్గొన్న ప్రిన్సిపల్స్, కళాశాలల నిర్వాహకులు

ప్రతి కళాశాల నుంచి విద్యార్థుల ఎంపిక

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి వచ్చే వారంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు ప్రతి కళాశాల నుంచి 10 మంది విద్యార్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించి అందులో 200 మందిని ఎంపిక చేసి శిక్షణకు పంపుతామన్నారు. ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, ఆర్‌ఐవో రమేష్, డీవీఈఓ దయానంద రాజు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డీడీలు రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, సెట్విన్ సీఈఓ మురళికృష్ణ, హెచ్‌సీఎల్ డైరెక్టర్ సుందర రామన్, హెచ్‌సీఎల్ సౌత్ జోన్ అధినేత రాజేష్, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, కేజీబీవీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని తల్లీకుమార్తె నిర్బంధం

- ఎస్పీ ఆదేశాలతో పోలీసులు చర్యలు
- 8 మంది నిందితులు అదుపులోకి
- బాధితుల విడుదల

నగరి : ఇచ్చిన అప్పు తీర్చకపోవడంతో కుటుంబంతో సహా నిర్బంధించిన కేసులో పోలీసులు 8మందిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని నత్తంకండ్రిగలో బుధవారం రాత్రి బాధితులను విడిపించారు. సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు తిరుపతికి చెందిన ఆనంద్ సతీష్ కుమార్‌కు నెత్తం కండ్రిగకు చెందిన హరిరెడ్డి రూ.6 లక్షలు అప్పిచ్చాడు. ఆ అప్పును అతను తిరిగి ఇవ్వక కాలయాపన చేయడంతో వడ్డీతో చేరి రూ.16 లక్షలు అయిందని, ఈ విషయమై చర్చించాలని, వెంటనే పుత్తూరు శివారులోని ఒక హోటల్ వద్దకు రమ్మని పిలిచాడు. ఈ నెల 5వ తేదీన ఆనంద్ సతీష్‌కుమార్ తన భార్య, కుమార్తెలను వెంటబెట్టుకుని అక్కడికి వచ్చాడు. అక్కడి నుంచి ఆనంద్ సతీష్‌కుమార్ కుటుంబసభ్యులను తన అనుచరుల సాయంతో బెదిరించి నెత్తం కండ్రిగలోని తన నివాసానికి తీసుకెళ్లి బంధించాడు. సాయంత్రం వరకు అక్కడే నిర్బంధించి ఎక్కడైనా డబ్బులు సేకరించి తనకు అప్పు చెల్లించి ఆనంద్ సతీష్‌కుమార్‌ను తీసుకెళ్లండని భార్య, కుమార్తెను వదలిపెట్టాడు. పోలీసులకు చెబితే జరిగేది వేరని బెదిరించాడు. జూన్ 15వ తేదీ వరకు డబ్బుల కోసం ప్రయత్నించి విఫలమవడంతో మళ్లీ నెత్తం కండ్రిగకు వారు వచ్చి తమను బంధించి ఆనంద్‌సతీష్‌కుమార్‌ను విడిచిపెడితే, ఆయన డబ్బులు సమీకరించుకుని వస్తాడని తెలిపారు.దీంతో అతన్ని వదలిపెట్టి వీరిద్దరినీ హరిరెడ్డి బంధించారు. బయటకు వెళ్లిన ఆనంద్‌సతీష్‌కుమార్ ఎంత ప్రయత్నించినా డబ్బులు అందకపోవడంతో బుధవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు నెత్తం కండ్రిగలో తిరుత్తణి రోడ్డును ఆనుకుని టీదుకాణం వద్ద ఉన్న ఇంటిని తనిఖీ చేయగా ఆనంద్‌సతీష్‌కుమార్ భార్య, కుమార్తె బంధీగా ఉన్నారు. వారిని విడిపించారు. ఈ ఉదంతానికి పాల్పడిన హరిరెడ్డి, రాజ, కొమిమిట్టకు చెందిన చిన్న, ఏకాంబరకుప్పంకు చెందిన ఢిల్లీబాబు, మనోహర్, నరేంద్ర, విజయకుమార్, అనితను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేస్తున్నారు.

కేసులో ఉన్న పోలీసుల బదిలీ

చిత్తూరు అర్బన్: తమిళనాడుకు చెందిన మహిళలు చేసిన లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను బదిలీ చేస్తూ చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వన్‌టౌన్, పూతలపట్టు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీ కేసుల్లో తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన పులియాండిపట్టికి చెందిన అయ్యప్పన్, అతని భార్య పూమతిని అరెస్టు చేయడం.. మిగిలిన నలుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. వాళ్లు రెండు రోజుల తరువాత కృష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, పోలీసులు తమను హింసించి లైంగికదాడి చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే ఎస్‌ఐతో సహా ఆరుగురు పోలీసులపై చిత్తూరులో కేసు నమోదు కాగా, ఎస్‌ఐను ఇప్పటికే బదిలీ చేశారు. ఇప్పుడు మిగిలిన సిబ్బందిని సైతం బదిలీ చేశారు. చిత్తూరు ఏఎస్పీ సుధాకర్ ఈ కేసును విచారిస్తున్నారు.

కృష్ణగిరిలో చిత్తూరు పోలీసులపై కేసు నమోదు

మరోవైపు ఈ ఘటనలో పూతలపట్టు ఎస్‌ఐ హరిప్రసాద్‌తో పాటు ఆరుగురు పోలీసులపై తమిళనాడులోని కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు, కులం పేరిట దూషించారన్న అభియోగాలతో వీరిపై కేసు నమోదైంది. ఈ కేసును చిత్తూరుకు బదిలీ చేస్తారా? లేకుంటే కృష్ణగిరి పోలీసులే దర్యాప్తు చేస్తారా ? అనేది తెలియాల్సి ఉంది.

మఠంలో అక్రమాలపై కొరడా

- మొన్న మఠాధిపతి.. నిన్న ఏఓ తొలగింపు
- హాథీరాంజీ మఠంలో అవకతవకలపై చర్యలు

సాక్షి, తిరుపతి : తిరుపతి హాథీరాంజీ మఠంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొన్న మఠాధిపతి అర్జున్‌దాస్.. నిన్న ఏఓ వీపీ మిశ్రాపై వేటు వేసింది. ఇప్పటి వరకు జరిగిన అవకతవకలపై విచారణకు ప్రత్యేక అధికారిని నియమించింది. ఆయన లోతుగా విచారించి ఏఓ మిశ్రాను తొలగించారు. హాథీరాంజీ మఠం ఆధీనంలో వేలకోట్ల రూపాయలు విలువ చేసే భూములు, ఆభరణాలు ఉన్న విషయం తెలిసిందే. తిరుపతి జిల్లాతో పాటు దేశ, విదేశాల్లో ఉన్న ఆస్తుల్ని సంరక్షించాల్సిన వారే స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విలువైన ఆస్తుల కోసం మఠాధిపతి సహకారంతో.. ఏఓ మిశ్రా హాథీరాంజీ మఠంలో తమ బంధువులను ఉద్యోగులుగా చేర్పించినట్లు తెలుస్తోంది. ముందుగా.. అర్జున్ దాస్ దూరపు బంధువుని అంటూ పీఏ టూ మహంత్ పేరుతో డాక్టర్ వీపీ మిశ్రా మఠంలోకి తాత్కాలిక ఉద్యోగిగా చేరారు. తర్వాత దేవదాయశాఖ కమిషనర్ అనుమతి లేకుండానే హాథీరాంజీ మఠానికి ఏఓగా (పరిపాలన అధికారిగా) నియమితులయ్యారు. డిప్యూటి డైరెక్టర్ హోదాలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, బెంగుళూరులో ఉద్యోగవిరమణ చేసిన మిశ్రా హాథీరాంజీ మఠంలో కీలకంగా మారారు. మఠాధిపతి అర్జున్ దాసు అండదండలతో వేల కోట్ల రూపాయల విలువైన హాథీరాంజీ మఠం ఆస్తుల్ని అన్యాక్రాంతం చేసేశారు. వీరిద్దరు కలిసి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెక్యూరిటీ ఆత్మహత్యతో..

గతంలో హాథీరాంజీ మఠం నుంచి బంగారం మిస్సయిన విషయం తెలిసిందే. ఈ కేసులో మఠం సెక్యూరిటీ అధికారిని అనుమానించటంతో ఆయన ఆత్మహత్య చేసుకోవడం విధితమే. ఆ ఘటనలో దేవదాయ శాఖ కమిషనర్ రెండేళ్ల క్రితం మిశ్రాను పదవి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మఠాధిపతి అర్జున్ దాస్ ఆ ఉత్తర్వులను పెడ చెవిన పెట్టారు. చివరకు మఠంలో అక్రమాలపై విచారణ చేపట్టిన సీఐడీ అధికారులు అందించిన నివేదిక మేరకు అర్జున్‌దాస్‌ను మహంత్ పదవి నుంచి సస్పెండ్ చేశారు. డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడుని మఠానికి ప్రత్యేక అధికారిగా నియమించారు. అప్పటి నుంచి మఠంలోని అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

తలకోన సిద్ధేశ్వరాలయం బోర్డు చైర్మన్‌గా వేణుగోపాల్‌రెడ్డి

భాకరాపేట : తలకోన శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న తర్వాత ఆయనతో ఈఓ జయకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సిద్ధేశ్వర స్వామి ఆలయ గోపురాన్ని సొంత నిధులతో పూర్తి చేస్తామన్నారు. తనను పదవిలో నియమించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఎమ్మార్సీ రెడ్డి, ఆలయ బోర్డు మాజీ చైర్మన్ రెడ్డెప్పరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలు కేసుల్లోని నిందితుడు అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: పలు కేసుల్లోని నిందితుడిని చిత్తూరు క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేసి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జ్ ఎదుట హాజరు పరిచారు. వివరాలు ఇలా...విశాఖపట్నం జిల్లా దేవరపల్లె మండలం కేఎం పాలెం గ్రామానికి చెందిన ఆవులరాజు (45)పై చిత్తూరు, నెల్లూరు, నాయుడుపేట, తిరుపతి, మదనపల్లె, ఇతర పోలీస్ స్టేషన్లల్లో పలు నేరాలపై కేసులు ఉన్నాయి. నిందితుడు 2014 నుంచి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. చిత్తూరు క్రైమ్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు బృందంతో కలిసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని పట్టుకున్నారు.

బస్సు డ్రైవర్‌పై కేసు

ఏర్పేడు: నిర్లక్ష్యంగా బస్సును నడుపుతూ మోటార్ సైక్లిస్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. ఈ నెల 18న సూళ్లూరుపేట డిపోకు చెందిన బస్సు డ్రైవర్ లోకనాథం శ్రీకాళహస్తి నుంచి రేణిగుంట వైపు వేగంగా వెళుతూ ఏర్పేడులోని వెంకగిరి రోడ్డు కూడలిలో వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు చంద్రయ్య, లక్ష్మీదేవికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అర్జీలకు క్యూకట్టిన జనం



క్యూలో అర్జీదారులు



రైతుల వద్ద అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

- పూతలపట్టులో రెవెన్యూ సదస్సు
- భూ సమస్యలే అధికం
- వీఆర్వోలు, సర్వేయర్లపై జేసీ, ఆర్డీఓకు పలు ఫిర్యాదులు

పూతలపట్టు(యాదమరి): రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పూతలపట్టు మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన నియోజకవర్గ రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన లభించింది. జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ రేణుక హాజరయ్యారు. మండల అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు ఉదయం 9 గంటలకే ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజలు సైతం తమ గోడు విన్నవించేందుకు సదస్సు ప్రారంభానికి ముందుగానే క్యూకట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా 146 అర్జీలు రాగా..ఇందులో పూతలపట్టు తహసీల్దార్‌కు సంబంధించి 87 అర్జీలు వచ్చాయి. మిలిగినవి బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె, యాదమరి మండలాలకు పరిధిలోని సమస్యలకు సంబంధించినవని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రతి మండలంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు పెత్తనం చెల్లాయిస్తు పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని జేసీకి రైతులు బహిరంగంగా ఫిర్యాదు చేశారు.

ప్రధాన సమస్యలు ఇలా....

- పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీలోని దొమ్మాండ్లపల్లికి చెందిన దొరస్వామి రెడ్డి 2013లో మ్యుటేషన్ కోసం 2022 జూన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇంత వరకు మ్యుటేషన్ జరగలేదని.. మార్పు చేసేందుకు వీఆర్‌ఓ రూ.10 వేలు డిమాండ్ చేసినట్లు రైతు అర్జీ సమర్పించాడు.
- పూతలపట్టు మండలం తిరుమల కొండయ్యగారి పల్లె సర్వే నంబరు 1,373,1.374 లోని భూములు ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు జేసీకి వినతి చేశారు.
- పూతలపట్టులోని మన్నారుపల్లెలో పూర్వీకుల 3 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితుడు చెంగల్‌రాయులు జేసీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చినా ఫలితం లేదని..వెంటనే తన భూమిని ఆన్‌లైన్ చేయించి పాసు పుస్తకం ఇప్పించాలని వేడుకున్నాడు. అలాగే కొత్తకోటకు చెందిన శంకర్‌రెడ్డి వారసత్వ ఆస్తిని ఆన్‌లైన్ చేయడం లేదని, నాలుగేళ్లుగా తిరుగుతున్న పట్టించుకోవడం లేదని మొరపెట్టుకున్నాడు.
- అనుభవంలో ఉన్న భూమి ఆక్రమణకు గురైందని ఐరాల మండలం పందికొట్టూరు గ్రామానికి చెందిన అములు అధికారులు అర్జీ సమర్పించాడు.
- యాదమరి, బంగారుపాళ్యం, అధికంగా పూతలపట్టులో భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ఆ పనికావాలంటే పైసలు లేకుండా చేయడం లేదని, ఇవ్వకపోగా సర్వే, దారి తగాదాలు, శ్మశాన సమస్యలు, మ్యుటేషన్, ఆన్‌లైన్ తదితర సమస్యలు అలాగే ఉన్నాయని పలువురు జేసీ ఎదుట తెలిపారు. జేసీ ఓపికగా సమస్యలు విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,831 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,831 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.11 కోట్లు మంది భక్తులు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.74.00

గంగజాతరకు వస్తుండగా..

- కారును ఢీకొన్న పాల ట్యాంకర్
- ఐదుగురికి తీవ్రగాయాలు

సోమల: మండలంలోని సూరయ్యగారిపల్లె సమపంలోని కురబలచెరువు వద్ద బుధవారం మ. ద్యాహ్నం కారును పాల ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో భాకరాపేటకు చెందిన నలుగురు, ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన ఐదుగురు మండలంలోని సూరయ్యగారిపల్లెలో జరుగనున్న గంగజాతరకు బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో దారితెలియక గ్రామ సమీపంలోని కురబలచెరువు వద్ద కారు ఆపి బంధువులకు ఫోన్ చేస్తున్నారు. ఈసమయంలో సోమల నుంచి సదుం వైపునకు వస్తున్న హెరిటేజ్ పాల ట్యాంకర్ అతి వేగంగా కారును ఢీ కొంది. ఈ ఘటనలో కారు, ట్యాంకర్ సూమారు 20 అడుగుల లోతులో ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడ్డాయి.



పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన వాహనాలు

కారులో ఉన్న విజయ్, మహేష్, సురేష్, ఖాజా ఫీర్‌తో పాటు ట్యాంకర్ డ్రైవర్ కామరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



అశోక్‌కుమార్ మృతదేహం

తడ: మండలంలోని మాంబట్టు వద్ద వాటర్ సర్వీసు దుకాణంలో అశోక్‌కుమార్(35) అనే వ్యక్తి బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివ రాలు.. సూళ్లూరుపేట మండలం అటకానితిప్పకు చెందిన అన్నదమ్ములు బాలసుందరం, అశోక్‌కుమార్ వాటర్ సర్వీస్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్ ఓ బైక్‌కు వాటర్ సర్వీస్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో స్థానికులు 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో



వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్ తాహీర్‌ను వెలికి తీస్తున్న స్థానికులు



గాయపడిన ప్రయాణికులు, స్తంభించిన ట్రాఫిక్

- 22 మందికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్

చౌడేపల్లె: చౌడేపల్లె– సోమల మార్గంలోని సింగిరి గుంట సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సును ఈచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో 22మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు .. పుంగనూరు నుంచి ఆర్టీసీ బస్సు తిరుపతికి ప్రయాణికులతో వెళ్తోంది. ఇదే క్రమంలో సదుం నుంచి టమాటా లోడ్‌తో ఐచర్ వాహనం వస్తోంది. సింగిరి గుంట సమీపంలో బస్సును ఈచర్ వాహనం అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఈచర్ వాహనం క్యాబిన్‌లోకి బస్సు దూసుకెళ్లింది. బస్సు డ్రైవర్ రెడ్డెప్ప(49), ప్రయాణికులు ఎస్. రమేష్‌బాబు(44), చిరంజీవి(30), కోకిల(25), చంద్రశేఖర్(50), జ్యోత్స్న(37),మరో 16 మంది గాయ పడ్డారు. టెంపో డ్రైవర్ తాహీర్ (27) ఈచర్ వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, తోటి ప్రయాణికులు వెలికి తీశారు. క్షతగాత్రులను 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ దూరం ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందిన వెంటనే ఎస్ఐ రవికుమార్ ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సెట్విన్‌లో ఉద్యోగ మేళా

తిరుపతి కల్చరల్: యువజన సర్వీసుల శాఖ, సెట్విన్, మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో ఆర్‌టీఏ పోస్టుకు, ఫార్మసీ–ఏఐడీఈ పోస్టుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హతతో పాటు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఫార్మసిస్ట్ పోస్టుకు డీబీఎం–ఫార్మసి చదివి 18–40 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని చెప్పారు. టెలీకాలర్ ఉద్యోగానికి డిగ్రీ చదివి 18–25 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. అలాగే సాయి సంగీత ఎలక్ట్రికల్స్‌లో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ ఉద్యోగానికి డిప్లొమా ఇన్ ఈఈఈ అర్హతతో పాటు 18 ఏళ్ల పైబడిన వారు అర్హులన్నారు. అలాగే ఎన్‌బీటీ మెడికేర్‌లో ర్యాక్ కీపర్, హెల్ప్ వర్కర్ ఉద్యోగానికి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివి 20 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఫార్మసిస్ట్ ఉద్యోగానికి డీబీఎం–ఫార్మసీ చదివి 20–50 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని, అకౌంటెంట్ పోస్టుకు డిగ్రీ, ఎంబీఏ చదివి 20 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. పైఅర్హతలు కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో గురువారం ఉదయం 10 గంటలకు అలిపిరి రోడ్డులోని ఎస్వీ మెడికల్ కళాశాల వద్ద, తిరుపతి చిరునామాకు హాజరు కావాలని కోరారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్
- బాలిక మృతి, తల్లికి తీవ్ర గాయాలు
- పూడి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం

పుత్తూరు రూరల్: షాపింగ్‌కు బయలుదేరిన తల్లీకుమార్తెల ఆనందం అంతలోనే ఆవిరైంది. కుమార్తెను ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించగా, తల్లి తీవ్రంగా గాయపడింది. వడమాలపేట– పూడి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈఘటన విషాదాన్ని నింపింది. ఆస్పత్రి వద్ద బంధువులు, గ్రామస్తుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా బుచ్చి మండలం రబల అమ్మవారితోపు గ్రామానికి చెందిన గౌతమ్ తిరుపతిలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. భార్య ప్రశాంతి, కుమార్తె యమున(14), కుమారుడు మోక్షిరుషి(8)తో కలసి బ్రాహ్మణపట్టులో నివాసం ఉంటున్నాడు. పత్తిపుత్తూరు హైస్కూల్‌లో అమ్ము 9 తరగతి, మోక్షిరుషి 3వ తరగతి చదువుతున్నాడు.



మృతి చెందిన యమున అలియాస్ అమ్ము (ఫైల్)

బుధవారం సాయంత్రం 'అమ్మా! స్కూల్ నుంచి వచ్చేశా... అంటూ ఆప్యాయంగా పలకరించింది యమున. సరే అమ్మా!... పేటకు వెళ్లి సిలిండర్ తేవాలి, షాపింగ్ చేయాలి రెడీ అవ్వు' అంటూ తల్లి చెప్పింది. రెడీ అయిన తల్లీ కూతుర్లు వడమాలపేట మండలం బ్రాహ్మణపట్టు నుంచి సిలిండర్‌తో స్కూటర్‌పై బయలు దేరారు. వడమాలపేట–పూడి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా మామిడి కాయల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన యమున తలపై ట్రాక్టర్ చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రశాంతి తీవ్రంగా గాయపడింది. తిరుపతి రుయాకు తరలించారు. యమున మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం



కె.హర్షిత్ టి.పి.రాజ్‌ప్రియన్ జె.శశాంక్ బి.చందుప్రజ్వల్ జి.కార్తిక పి.జ్ఞానేంద్రరెడ్డి

- విద్యాలయాలకు 42 మంది విద్యార్థుల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో 2023–2024 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి, ఈ ఫలితాల్లో కే.హర్షిత్, వి.చందు ప్రజ్వల్, జీ.కార్తీక, బి.హేమంత్ కుమార్, పీ.జ్ఞానేంద్ర రెడ్డి, ఎం.తీర్థ, టి.పీ.రాజ్ ప్రియన్, జే.శశాంక్, ప్రణీత్‌తో పాటు మొత్తం 42 మంది తమ విద్యార్థులు సీట్లు సాధించారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను సాధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి అభినందించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



చిరంజీవి మృతదేహం



భార్యబిడ్డలతో చిరంజీవి (ఫైల్)

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని దామినీడు వద్ద బుధవారం జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. నగరి మండలం కనికాపురం గ్రామానికి చెందిన చిరంజీవి (24) బైక్‌పై తిరుపతికి వెళుతుండగా లారీ వెనకనుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కాలేజీకి తరలించారు. మృతుడికి భార్య, చిన్నబిడ్డ ఉన్నారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్ : గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు జూలై 5వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21వ తేదీ తిరుపతి చెన్నారెడ్డి కాలనీ శ్మశానం వద్ద చెన్నారెడ్డి కాలనీకి చెందిన తంబూరు శ్యాంప్రసాద్, కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన కోనేటి జగదీష్ గంజాయితో ఉండగా అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు..

వివాహిత ఆత్మహత్య కేసులో ఆమె భర్త ఎస్. సురేష్‌బాబుకు జూలై 4వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు ఆదేశాలు జారీచేశారు. ఈనెల 19వ తేదీ సురేష్ బాబు భార్య ఆత్మహత్యకు పాల్పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి



మృతి చెందిన కృష్ణయ్య



మృతి చెందిన గురుచరణ్



గాయపడిన చరిష్మా

నారాయణవనం: స్థానిక బాలిక ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. వివరాలు.. మండలంలోని వెలుతురుకండ్రిగకు చెందిన కృష్ణయ్య(40) జ్వరంతో బాధపడుతున్న కుమార్తె చరిష్మా(7)ను చికిత్స నిమిత్తం కుమారుడు గురుచరణ్(3)తో కలిసి బైక్‌పై పుత్తూరుకు తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఉండగా మామిడికాయల లోడ్‌తో ముందు వెళుతున్న ట్రాక్టర్ హఠాత్తుగా ఆగడంతో వెనుకనుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య, గురుచరణ్, చరిష్మా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణయ్య, గురుచరణ్ మరణించారు. చరిష్మాను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నామన్నారు. మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుబసభ్యులకు బుధవారం అప్పగించినట్లు వెల్లడించారు.

శ్రీసిటీలో ఘనంగా యోగా దినోత్సవం




యోగా చేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు



సత్యారావుకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీసిటీ జీఎం

వరదయ్యపాళెం: శ్రీసిటీలో బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉదయం స్థానిక విజిటర్స్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 260 మంది పాల్గొన్నారు. సన్యాసిరావు మాట్లాడుతూ వసుధైక కుటుంబం థీమ్‌గా ఎంపిక చేయడం ఈ ఏడాది యోగా దినోత్సవ ప్రత్యేకతగా తెలిపారు. ఏలూరులోని యోగా కాన్షియస్‌నెస్ ట్రస్టుకు చెందిన యోగా గురువు సత్యారావు ఆధ్వర్యంలో వివిధ శ్వాస వ్యాయామాలపై శిక్షణ ఇచ్చారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో భారతావని మానవాళికి అందించిన అపూర్వ బహుమతి యోగా అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. స్థానిక క్రిక్ సైడ్ అపార్ట్‌మెంట్‌లో ప్రతిరోజూ యోగా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీసిటీ సెజ్ అథరైజ్డ్ అధికారి రామారావు, డీఎస్పీ జగదీష్ నాయక్, సెజ్ స్పెసిఫైడ్ ఆఫీసర్ మధుబాబు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సత్యనారాయణ, సెక్యూరిటీ, విజిలెన్స్ హెడ్ రమేష్ పాల్గొన్నారు.

డ్యామ్ గ్యాలరీలో వ్యక్తి మృతి



లక్ష్మప్ప (ఫైల్)

తిరుమల : తిరుమల పాపవినాశనం డ్యామ్‌లోని గ్యాలరీలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. తిరుమల టూటౌన్ ఎస్ఐ సాయినాథ్ చౌదరి కథనం మేరకు.. కర్ణాటకలోని హావేరి జిల్లా, కమలాపురం గ్రామానికి చెందిన కేఎల్ లక్ష్మప్ప (59) మే 26వ తేదీన తమ కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. శ్రీవారిని దర్శించుకుని కుటుంబసభ్యులతో కలిసి బయటకు వచ్చిన లక్ష్మప్ప కనిపించకుండా పోయాడు. ఎంత గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి సీసీ కెమెరాల ద్వారా లక్ష్మప్ప ఆచూకీని గుర్తించి గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం పాపవినాశనం డ్యామ్‌లో ఓ మృతదేహం తేలుతున్న సమాచారం అందడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అది లక్ష్మప్ప మృతదేహంగా గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.